# ప్రైవేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం

- అడ్డగోలు ఫీజుల వసూలు
- పాఠశాలలోనే యూనిఫాం, పుస్తకాల విక్రయం
- విద్యా హక్కు చట్టానికి తూట్లు
- లబోదిబోమంటున్న తల్లిదండ్రులు
- ఉదాసీన వైఖరిలో విద్యాశాఖాధికారులు



ఖలీల్‌వాడి, జూన్ 19 : జిల్లాలో ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీకి అడ్డూ అదుపులేకుండా పోతున్నది. ఫక్తు వ్యాపార ధోరణితో యాజమాన్యాలు వ్యవహరిస్తుండడంతో సామాన్యుడికి ఉన్నత విద్య అందని(ద్రాక్షగా మారుతున్నది.

ఎంతో కష్టపడి సంపాదించినదంతా పిల్లల చదువుకే ఖర్చుపెడుతుండడంతో పేద, మధ్యతరగతి వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తున్నది. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదివించాలంటేనే జంకుతున్నారు. విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేట్ విద్యా సంస్థలు ఇష్టారీతిన ఫీజులను వసూళ్లు చేస్తున్నాయి. తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదివించాలనే తల్లిదండ్రుల ఆకాంక్షను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పాఠశాల, కళాశాలల్లో ఫీజులకుతోడు యూనిఫాంలు, పుస్తకాలు, నోట్‌బుక్‌లు, బస్సు ఫీజులంటూ వసూలు చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంటే చాలు తల్లిదండ్రులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. కొంతమంది వడ్డీలకు డబ్బులు తీసుకవచ్చి పిల్లలను చదివిస్తూ అప్పుల పాలవుతున్నారు.

**ఫీజులతోపాటు పుస్తకాల రేట్ల పెంపు**

గతేడాది కన్నా ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు 10 నుంచి 30 శాతం వరకు ఫీజులను పెంచాయి. దీనికితోడు పుస్తకాలు, నోటు పుస్తకాల రేట్లు 20 శాతం పెరగడం తల్లిదండ్రులకు అదనపు భారంగా మారింది.

జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ల కోసం డొనేషన్లు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని నియంత్రించడంలో విఫలమవుతున్నారు. ప్రతి ఏడాది ప్రైవేట్ విద్యాసంస్థలు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని ఒక కార్పొరేట్ కళాశాల నిర్వాహకులు వసతులు లేకున్నా భవనాన్ని లీజ్‌కు తీసుకొని నిర్వహిస్తున్నారు. ఒకటి రెండు ర్యాంక్‌లు వస్తేనే జిల్లా వ్యాప్తంగా మార్మోగేలా ప్రచారం చేయడం గమనార్హం. ఫెయిల్ అయిన వారి గురించి మాత్రం ఎక్కడా ప్రస్తావించడంలేదు. అసలు ఆ కళాశాలలో ఎంతమంది చదువుతున్నారో తెలియని పరిస్థితి. చదువు చెప్పే అధ్యాపకులకు అర్హత ఉందోలేదో కూడా ఎవరికీ తెలియదు.

**వసతుల పేరిట దోపిడీ**

ఈ విద్యా సంవత్సరం జిల్లాలో కొత్తగా కళాశాలలు, పాఠశాలలు పుట్టుకువచ్చాయి. అర్హత లేని వారు విద్యా సంస్థలను నడుపుతూ.. నయా దోపిడీకి శ్రీకారం చుడుతున్నారు. తమ వద్ద కొన్ని ప్రత్యేకమైన వసతులు, తరగతులు ఉంటాయని చెబుతూ తల్లిదండ్రుల నుంచి యథేచ్ఛగా ఫీజులు వసూలు చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు తప్పని పరిస్థితిలో ఫీజులను చెల్లిస్తున్నారు. హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి తమ పిల్లలను చదివించలేని పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలు ఇక్కడే స్థానికంగా ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజులను పెంచేసి దోపిడీకి పాల్పడుతున్నాయి. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ, నర్సరీ తరగతుల ఫీజులే రూ.50వేల వరకు ఉన్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు నోట్ పుస్తకాలు, డ్రెస్సులు, బస్సు ఫీజులతో తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారు.

**పాఠశాలల్లోనే పుస్తకాల విక్రయాలు**

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌పుస్తకాలు అమ్మవద్దని స్పష్టమైన నిబంధనలు ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. అడ్మిషన్ తీసుకోగానే తమ పాఠశాలలోనే పుస్తకాలు, డ్రెస్‌లను విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. హోల్‌సేల్ రేట్లకు పుస్తకాలు, నోట్‌పుస్తకాలను కొనుగోలు చేస్తున్న పాఠశాలలు వాటిని ఎమ్మార్పీకి విక్రయిస్తున్నారు.

గత విద్యాసంవత్సరం ఒక్కో తరగతికి రూ. 3 వేల నుంచి 4 వేలు ఉన్న పుస్తకాల ధరలు ఈ విద్యాసంవత్సరం రూ. 6వేల నుంచి రూ.7 వేల వరకు పెరిగాయి. ఫీజుల నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఎక్కడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. నోటీసు బోర్డులపై పాఠశాల ఫీజుతో పాటు పరీక్ష ఫీజును ప్రదర్శించాల్సి ఉన్నా అది అమలుకావడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉత్తర్వులు, ఆదేశాలను విద్యాహక్కు చట్టాన్ని ప్రైవేట్ పాఠశాలలు అమలుచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటాం**



వసతులు లేని పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకుంటాం. అర్హత లేని ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉంటే నోటీసులు జారీ చేస్తాం. అధిక ఫీజులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే సదరు విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటాం.

-రఘురాజ్, డీఐఈవో

**ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య**



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన అందుబాటులో ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఫీజుల గురించి తల్లిదండ్రులు, విద్యార్థులను కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తే ఫిర్యాదు చేయాలి.

-దుర్గాప్రసాద్, డీఈవో

## తాత్కాలిక అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, జూన్ 19 : కామారెడ్డి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక అధ్యాపకుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ నిజామాబాద్ రీజియన్ ఆర్సీవో వి.మేరి యేసుపాదం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఎల్, పీజీటీ పోస్టులకు కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పీజీ, డిగ్రీతో పాటు బీఈడీ అర్హత కలిగి ఉండాలి. టీజీటీ పోస్టుకు డిగ్రీ బీఎస్సీ, బీఏ, బీకాంలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు బీఈడీ అర్హత కలిగి ఉండాలి. పీఈటీ పోస్టుకు వ్యాయామ విద్యలో 50 శాతం మార్కులతో డిగ్రీ కలిగి ఉండాలి. అసిస్టెంట్ కేర్ టేకర్ పోస్టుకు ఏదైనా సబ్జెక్టులో డిగ్రీతో పాటు బీఈడీ ఉత్తీర్ణత, కంప్యూటర్ వినియోగంలో ప్రావీణ్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. డిచ్‌పల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో ఈనెల 26న సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ఎల్లారెడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో డెమో తరగతులు ఉంటాయని తెలిపారు.

**ఖాళీ పోస్టుల వివరాలు..**

జూనియర్ లెక్చరర్ (11), పీజీటీ (7), టీజీటీ (9), పీఈటీ (2), అసిస్టెంట్ కేర్ టేకర్ (6).

## కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాల భర్తీ

కామారెడ్డి, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీల్లో స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్టీ, సీఆర్టీ, పీఈటీలను అర్బన్ రెసిడెన్షియల్‌లో భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమికంగా మొత్తం 65 ఖాళీలను గుర్తించగా... వాటిలో సీఆర్టీ తెలుగు-3, సీఆర్టీ హిందీ-3, పీజీ సీఆర్టీ తెలుగు-6, పీజీసీఆర్టీ ఇంగ్లిష్-6, పీజీసీఆర్టీ మ్యాథ్స్-5, పీజీసీఆర్టీ ఫిజిక్స్-4, పీజీసీఆర్టీ కెమిస్ట్రీ-4, పీజీసీఆర్టీ బాటనీ-4, పీజీసీఆర్టీ జువాలజీ-4, పీజీసీఆర్టీ నర్సింగ్-6, పీజీసీఆర్టీ కామర్స్-2, పీజీసీఆర్టీ ఎకనామిక్స్-3, పీజీ సీఆర్టీ సివిక్స్-2 ఖాళీ ఉన్నట్లు వివరించారు. మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఈ నెల 26 నుంచి జూలై 7వ తేదీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, రాత పరీక్షల్లో అర్హత సాధించాలని, పరీక్షా విధానం ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్హతలు, రాత పరీక్ష విధానం, సిలబస్, అభ్యర్థుల ఎంపిక విధానం తదితర వివరాలను http://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు.

# గుప్తనిధి కోసం తవ్వకాలు

- సుమోటో కేసు నమోదు చేసిన పోలీసులు



ఇంట్లో తవ్విన గుంత

నిజామాబాద్ క్రైం, జూన్ 19 : ఓ ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా పోలీసులు దాడి చేసి ఇంటి యజమానిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన ఎస్సై జి. లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గూపన్‌పల్లి గ్రామానికి చెందిన ఇందూరు గంగాధర్ తన ఇంట్లో గుప్తనిధి ఉన్నదని సోమవారం తవ్వకాలు చేపట్టాడు. సమాచారం అందుకున్న ఎస్సై లింబాద్రి తన సిబ్బందితో కలిసి ఇంటిపై దాడి చేశారు. ఇంటి యజమాని గంగాధర్ ఇంటి తలుపులకు లోపలి నుంచి గడియ పెట్టుకొని తానే స్వయంగా ఇంట్లోని ఓ మూలకు లోతైన గొయ్యిని తీసినట్లు పోలీసులు గుర్తించారు. సదరు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని సుమోటో కింద కేసు నమోదు చేశారు. ఇందూరు గంగాధర్ తన భార్య, పిల్లలను నాలుగు రోజులుగా ముబారక్‌నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంచాడని తమ విచారణలో తేలిందని ఎస్సై వెల్లడించారు. ఇందూరు గంగాధర్ మాత్రం తన ఇంట్లో కింది భాగంలో ఉన్న ఇసుకను తీసేందుకే గొయ్యిని తవ్వినట్లు పోలీసులకు తెలిపారు.

# కొనసాగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

నిజామాబాద్ క్రైం, జూన్ 19 : ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతున్నది. ఆరో రోజు సోమవారం 600 మంది అభ్యర్థులను వెరిఫికేషన్ కోసం పిలువగా.. 529 మంది హాజరైనట్లు ఇన్‌చార్జి సీపీ సీహెచ్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. నిజామాబాద్ పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశారు. టీఎస్ ఎల్‌పీఆర్‌బీ-2022 ప్రకారం పోలీస్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకొని, ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షలు, ఈవెంట్స్, ఫిట్‌నెస్ తదితర అంశాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల సర్టిఫికెట్లను అదనపు డీసీపీ (ఏఆర్)విభాగం గిరిరాజు ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ నెల 23వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, మక్సూద్ హైమద్, గోవింద్, సీపీవో, రిజర్వ్, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీయూలో డిగ్రీ పరీక్షలు వాయిదా

డిచ్‌పల్లి, జూన్ 19 : తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్, 1వ, 3వ, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు ఈ ఈనెల 20వ తేదీన నిర్వహించాల్సి ఉండగా.. వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారిణి ప్రొఫెసర్ అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జూలై 3 నిర్వహించనున్నట్లు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న తెలంగాణ ఎడ్యుకేషన్ డేను పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. మరిన్ని వివరాలకు www.telanganauniversity.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## విధులకు ఆటంకం కలిగించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు



తాళం వేయడంతో జీపీ కార్యాలయంలో ఉన్న సర్పంచ్, ఉపసర్పంచ్

నందిపేట్, జూన్ 19: మండలంలోని లక్కంపల్లి సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు సిబ్బందిని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉంచి బయటి నుంచి తాళం వేశారు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కంపల్లి గ్రామశివారులోని భూముల విషయంలో తప్పుడు సమాచారంతో గ్రామానికి చెందిన సాగర్, రాజశేఖర్ అనే వ్యక్తులు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి సర్పంచ్ సుమలత, ఉపసర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి రమేశ్ జీపీ కార్యాలయంలో ఉండగానే బయటి నుంచి తాళం వేశారు. పూర్తి సమాచారం లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తూ తమ విధులకు ఆటంకం కలిగించారని కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్ వివరించారు.

# జిల్లా వ్యవసాయశాఖలో ఉద్యోగుల మూకుమ్మడి సెలవులు

- జిల్లావ్యవసాయాధికారి వేధింపులు భరించలేక..
- సమావేశమై నిర్ణయించుకున్న ఉద్యోగులు

ఖలీల్‌వాడి, జూన్ 19 : జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖలోని ఉద్యోగులందరూ ఇటీవల సమావేశమై మూకుమ్మడిగా సెలవులు పెట్టాలని నిర్ణయించుకోవడం చర్చనీయాంశమైంది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన జిల్లా వ్యవసాయాధికారి (జేడీఏ) తిరుమలప్రసాద్ వ్యవహార శైలి, ప్రవర్తన, ఉద్యోగుల సతాయింపు తదితర అన్ని విషయాలపై జిల్లాలోని వ్యవసాయశాఖ ఉద్యోగులందరూ మూకుమ్మడిగా మాస్ సెలవులు పెట్టేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తిరుమలప్రసాద్ ఇంతకుముందు జగిత్యాల జిల్లాలో పని చేసి.. డిమోషన్‌పై జిల్లాకు ఏడాది క్రితం వచ్చారు. అప్పట్లో జిల్లా వ్యవసాయాధికారిగా పనిచేసిన గోవింద్ బదిలీ అయిన తర్వాత జిల్లా వ్యవసాయ శాఖ జేడీఏగా తిరుమల ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిందే తడవుగా జిల్లావ్యాప్తంగా వ్యవసాయశాఖలోని ఉద్యోగులందరినీ వేధించడం, అవమానించడం, మనశాంతి లేకుండా చేయడమే పనిగా పెట్టుకొని నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని జిల్లాలోని వ్యవసాయశాఖలోని ఉద్యోగులందరూ విమర్శిస్తున్నారు. ఇటీవల జిల్లాలోని వ్యవసాయ శాఖలోని ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు, సిబ్బంది మొత్తం కలిసి ఆర్మూర్‌లో, జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో సమావేశమై జేడీఏతో పడుతున్న ఇబ్బందులపై చర్చించుకున్నట్లు తెలిసింది.

జిల్లా వ్యవసాయాధికారి తిరుమలప్రసాద్‌తో వేగలేమంటూ ఆయనను నిజామాబాద్ జిల్లా నుంచి బదిలీ చేయాలంటూ ఆ శాఖలోని ఉద్యోగులంతా కోరుతున్నట్లు తెలిసింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన జిల్లా వ్యవసాయాధికారి ఆ శాఖలోని ఉద్యోగులందరినీ ఇబ్బందులు పెడుతున్న విషయాన్ని జిల్లా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ దృష్టికి జిల్లాలోని వ్యవసాయశాఖ ఉద్యోగులందరూ తీసుకెళ్లినట్లు సమాచారం.

ఏది ఏమైనా జిల్లాలోని వ్యవసాయశాఖ ఉద్యోగులందరూ ఆంధ్ర అధికారి పెత్తనానికి వేధింపులతో వేగలేమంటూ జిల్లాకు వ్యవసాయశాఖకు చెందిన ఉద్యోగులందరూ మూకుమ్మడి సెలవులు పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆ శాఖలోని ఉద్యోగులందరూ జిల్లా వ్యవసాయశాఖ అధికారిపై వేగలేమంటూ జెండా ఎగురవేశారు. ఆంధ్ర వాళ్లతో వేగలేమంటూ కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో.. జిల్లాలోని వ్యవసాయ శాఖ సిబ్బందిపై పెత్తనం చలాయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న అతడి వ్యవహారం ఎక్కడి వరకు సాగుతుందో వేచిచూడాలి.